క్లుప్తంగా

అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో, పూలమాలలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు. వచ్చిన భక్తులు కానుకలను ముడుపులను సమర్పించుకుని ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో నాగులకు పూజలు



దుగ్గాయపల్లెలో పుట్టలకు పూజలు చేస్తున్న మహిళలు

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో భక్తులు ఆదివారం నాగులకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాగుల చవితి పండుగ నాడు ఉపవాసాలు వుండని వారు శ్రావణ మాసంలోని ఆదివారాల్లో ఉపవాసాలు వుండి నాగులకు పూజలను నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా మహిళలు నాగులకు, పుట్టలకు ఉపవాస దీక్షలను చేపట్టి, ఆలయాల వద్ద వున్న పుట్టలకు పోగులు చుట్టి, పత్తి వత్తులను, నాగుల చీరలను వుంచి పూజలను నిర్వహించారు. సలిపిండి, నువ్వుల పిండి, పెసర బేడలు, బియ్యం, కొబ్బెర, బెల్లంలను నాగులు, పుట్టలకు సమర్పించారు. అనంతరం వాటిని ప్రసాదాలుగా పంచి పెట్టారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా సీఐ మహ్మమద్‌రఫీ

కొండాపురం : గ్రామంలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఆదివారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన టి.కోడూరులో పోలీస్‌సిబ్బందితో నాకాబందీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శాంతీయుతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గొడవలు పడిన కుటుంబాల జీవితాలు అందకారంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల సీఐ నరేష‌బాబు, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య కోరారు. మండలంలోని పెన్నానగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వై.హరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ వాహనదారుల చట్టాల కింద ఆటో డ్రైవర్లపై అధిక మొత్తంలో చలనాలను వేసి వసూలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆటో, లారీ డ్రైవర్లపై ఎఫ్‌సీ, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి వాటిని ఏడాదికోమారు సవరణలు చేస్తూ అధిక మొత్తంలో ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయని తెలిపారు. డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, మాబు, దొలా, కార్యదర్శి మచ్చా శ్రీను, సురేంద్ర, ఎల్లయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రతిభ



కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లెరంగయ్యగారి వెంగలరెడ్డి, విజయమ్మ కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ఆలిండియా 1,443వ ర్యాంకు సాధించాడు. ఆగస్టు 11న జరిగిన నీట్ పీజీ పరీక్షలో సత్తా చాటాడు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మరెన్నో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

ఆసుపత్రుల వద్ద భద్రత కల్పించాలి



కలకత్తాలోని ఆర్‌జీ కర్ వైద్య ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య మరువక ముందే తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యురాలిపై దాడి చేయడం దారుణం. ఆసుపత్రుల వద్ద పోలీస్ సిబ్బందితో భద్రత కల్పించాలి. అసలు రోగులు వైద్య సేవలు పొందడానికి ఆసుపత్రులకు వస్తున్నారా? లేక వైద్యులపై దాడులు చేయడానికి వస్తున్నారా? అర్థం కావడం లేదు. – అరుణ, ఏఎన్ఎం, 3వ సచివాలయం, కమలాపురం



త్వరగా శిక్షపడేలా చేయాలి



తప్పుచేసిన వారికి త్వరగా శిక్షపడేలా చేయాలి. వైద్య సిబ్బంది భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్య సిబ్బందిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి. ముఖ్యంగా వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పిస్తూ వ్యవస్థను ఏర్పాటు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలి.

– రమణమ్మ, ఏఎన్ఎం, వేముల

ప్రత్యేక రక్షణను ఏర్పాటు చేయాలి



కోల్‌కత్తా వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి కిరాతకంగా హతమార్చారు. ఆసుపత్రిలో వైద్యులతో పాటు సిబ్బందికి ప్రత్యేక రక్షణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ఇలాంటి సంఘటనలపై అవగాహన కల్పించాలి.

– టి.నందిని, ఎన్ఎం, లింగాల

పేరుకుపోతున్న పారిశుద్ధ్యం



జమ్మలమడుగు ఆస్పత్రిలో డయేరియా, టైఫాయిడ్‌తో చికిత్స పొందుతున్న రోగులు



జమ్మలమడుగు : ఓపీలో నిలబడ్డ రోగులు

పులివెందుల, వేముల, లింగాల, జమ్మలమడుగు : పట్టణ, గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం పెరిగిపోతోంది. మురికి కాలువలు నిండి రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు విజృంభిస్తున్నాయి. మూడు రోజుల క్రితం లింగాల మండలం చిన్నకుడాల గ్రామానికి చెందిన కామాక్షమ్మ అనే మహిళ డెంగీ జ్వరంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎలాంటి పారిశుద్ధ్య పనులు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్లను ఏర్పాటు చేసి వైద్యులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజలు ఆరోగ్యాన్ని పరీక్షించి తగిన చికిత్సలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించి దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో రాఘవేంద్రస్వామి సమీపంలో ఉన్న కాలనీలో మ్యాన్‌హోల్స్ నిండి మురుగు ప్రవహిస్తోంది. నెలరోజులనుంచి ఇదే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. దీంతో దోమలు వృద్ధిచెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు.

టైఫాయిడ్ అని చెప్పారు



ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రిలో చూపించుకున్నాను. రక్తపరీక్షలు చేసి టైఫాయిడ్ అని నిర్ధారించారు. గత ఐదు రోజులనుంచి ప్రభుత్వాసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాను. ప్రస్తుతం రక్త కణాలు తగ్గాయని చెబుతు న్నారు. దీంతో జ్వరం తగ్గడంలేదని డాక్టర్లు చెబుతున్నారు. పారిశుద్ధ్య లోపంవల్లే ఇదంతా జరుగుతోంది.

– ఓబుళపతి, సి.కొత్తపల్లి మైలవరం మండలం.

రక్త పరీక్షలు చేస్తున్నాము



వాతావరణం ప్రభావం చేత డయేరియా, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. వచ్చిన రోగులకు మంచి వైద్యం అందించడంతోపాటు రక్త పరీక్షలు చేస్తున్నాము. వచ్చిన రోగులకు సరైన వైద్యం అందించడంతోపాటు వారికి కావలసిన మందులను అందజేస్తున్నాము.

– రఫిక్‌పాషా, సూపరింటెండెంట్, జమ్మలమడుగు



వేముల : పెండ్లూరులో వీదులలో ఉన్న మురుగు నీరు



పులివెందుల : మ్యాన్‌హోల్ నిండటంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నేడు శ్రీకృష్ణ జయంతి వేడుకలు



రాధాకృషుడి వేషదారణలో చిన్నారులు

కమలాపురం : స్థానిక రైల్వేగేటు సమీపంలో వెలసిన శ్రీరాధాకృష్ణ మందిరంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకులు పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, గోపూజ, గణపతి పూజ విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణము, భజనలు, 11 గంటలకు తులసీ సహస్రనామ కుంకుమార్చన 12 గంటలకు అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం వటపత్రసాయి వారి ఊంజల్ సేవ, అనంతరం పల్లకి సేవ, విష్ణ సహస్రనామ పూజ, ఉట్టి కొట్టు కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. శ్రీ కృష్ణుని వేషధారణలో వచ్చిన చిన్నారులకు బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

పాలపండ్ల ఎద్లకు బండలాగుడు పోటీలు

క్రిష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని పాల పండ్ల ఎద్లకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు ఇవ్వనున్నారు. అలాగే 9 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని, ముగ్గులకు కావలసిన రంగులు అభ్యర్థులే తెచ్చుకోవాలని, గెలుపొందిన విజేతలకు రూ. 4వేలు, రూ.3వేలు, రూ.వేలు, రూ.1000 నగదు బహుమతులు ఇస్తామన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృషుడి వేషదారణలో చాన్‌బాషా

పులివెందుల టౌన్ : స్థానిక విద్యాధరి పాఠశాలలో ఆదివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాధా కృష్ణుల వేషదారణలో అందంగా ఆకర్షణీయంగా ముస్తాబై వచ్చి ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణుని పాదముద్రలు వేయడం, ఉట్టికొట్టడం కార్యక్రమాలు చేపట్టారు. అలాగే శ్రీకృష్ణాష్టమి పండుగకు సంబంధించిన పాటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్యాలు అందరినీ ఆకర్శించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు, సీఈఓ భానుప్రకాష్, ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే పోరాటమే



కార్యకర్తల సమక్షంలో కేకును కట్‌చేస్తున్న సతీష్ కుమార్‌రెడ్డి

వేంపల్లె : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోతే ప్రజల తరపున పోరాటం చేస్తామని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోలేదని కేవలం చంద్రబాబునాయుడు ఇచ్చిన అబద్దపు హామీలను నమ్మి ప్రజలు కూటమికి ఓట్లేశారన్నారు. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి తాము ఎప్పుడూ ముందుండి సహకరిస్తామన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది సేవ చేయడానికి మాత్రమేనని ధనార్జన, అక్రమార్జన లక్ష్యంగా దోచుకోవడానికి కాదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చు తామా లేదా అని సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి పులివెందుల నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాడన్నారు. పులివెందులలో మెడి కల్ కాలేజి, వేంపల్లెలో ఉర్దూ కళాశాల పట్టణ సుందరీ కరణ, పార్కు, ఫైర్ స్టేషన్, జడ్పీ బాలు రు, బాలికల ఉన్నత పాఠశాలలు, తదితర అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. అలాగే అండర్ డ్రై నేజి వ్యవస్థ, రోడ్డు విస్తరణ పనులు, బస్టాండు, వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ కలాశాల, గండి ఆల య పునర్నిర్మాణం, పనులు, గిడ్డంగివారిపల్లెలో మినీ రిజర్వాయర్, చక్రాయపేట మండలంలోని కాలేటివాగు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు తదితర అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అబివృద్ధి అంటే ఇసుక అమ్ముకోవడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి సంప్రదాయాలకు స్వస్తి చెప్పి పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదామన్నారు. సతీష్‌కుమార్‌రెడ్డి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి వేంపల్లెకు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యకర్తలు అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మనిషి మరణించినా లోకాన్ని చూపించేది నేత్రం



డీఎస్పీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ తదితరులు

పులివెందుల రూరల్ : మనిషి మరణించిన లోకాన్ని చూపించేది నేత్రాలే అని సీఐ జీవన్ గంగాధర్‌బాబు అన్నారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో స్నేహిత అమృత సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రాలు దానం చేయడం వల్ల అంధత్వంతో బాధపడుతున్న అంధులకు చూపు ఇవ్వడంతో పాటు మనిషి మరణానంతరం ఈలోకాన్ని చూసే వరం మనిషికి ఇవ్వడమేనన్నారు. ప్రతిఒక్కరు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు



సందేశాన్ని వినిపిస్తున్న కడప మేత్రాసనం పీఠాధిపతి గాలి బాలి

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయ (చర్చి) సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో చివరి రోజైన ఆదివారం కడప మేత్రాసనం పీఠాధిపతి గాలిబాలి పాల్గొని తన సందేశాన్ని వినిపించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. 50 మంది దివ్య బలి పూజ సమర్పించారు. ఐపీఎల్ క్రికెటర్ పైడికాలువ విజయ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చెక్క భజన కార్యక్రమం ఆకట్టుకుంది. రాత్రి శ్రీదేవి డ్రామా కంపెనీ ఆర్టిస్టులచే ప్రదర్శించబడిన సాంస్కృతికి కార్యక్రమాలు, రేలా రేలా కార్యక్రమం అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ జీవన్ కుమార్, క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

జన చైతన్య సంఘం మాజీ డైరెక్టర్ మృతి

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంకు చెందిన జన చైతన్య సమగ్రాభివృద్ధి సంఘం మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జన చైతన్య మ్యాట్స్ గౌరవ అధ్యక్షుడు తిప్పన నాగేశ్వరనాయుడు ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. సోమవారం బ్రహ్మంగారిమఠంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా అభివృద్ధిపై ఊసే లేదు

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు వంద రోజులు అవుతున్నా జిల్లా అభివృద్ధిపై వారికి ధ్యాస ఉన్నట్లు కనిపించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగనపల్లి చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా అభివృద్ధికి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఉక్కు కర్మాగారం ఊసే లేదని, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదని, కొప్పర్తి పారిశ్రామిక వాడకు నిధులు ఇవ్వలేదని అన్నారు. అలాగే కడప, బెంగళూరు రైల్వే మార్గానికి నిధులు విడుదల చేయలేదని అన్నారు. రైల్వే జోన్ గురించి ప్రస్తావించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.15 వేలు కోట్లు మంజూరు చేసిందని, దీనిని వడ్డీతో సహా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదని కోరారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన వ్యవస్థకు కృషి చేయడం లేదని ఆరోపించారు. టీడీపీ నాయకులు గ్రామాల్లో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ముంతాజ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ పాల్గొన్నారు.

కుందూలో పరవళ్లు.. పెన్నాలో విలవిలా...



పరవళ్లు తొక్కుతున్న కుందూ నది



వెలవెల బోయిన పెన్నానది

జమ్మలమడుగు : పెద్దముడియం మండలంలోని కుందూ నది నీటితో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. ప్రతి ఏడాది కుందూ నదిలో నీటి ప్రవాహంతో కళకళ లాడుతూ రైతుల కన్నుల్లో ఆనందాన్ని నింపుతుంది. కుందూ నది పరివాహక ప్రాంతంలోని రైతుల బోర్ల నీటితో రీచార్జీ అవుతున్నాయి. అయితే జమ్మలమడుగు మండలం పరిధిలో ఉన్న పెన్నానది పరిస్థితి వేరుగా కనిపిస్తుంది. పెన్నానది పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు లేకపోవడంతో పెన్నానది నీటి ప్రవాహం లేక వెలవెల బోతుంది. 2021 సంవత్సరంలో పెన్నానది పరవళ్లతో కళకళలాడింది. మూడు సంవత్సరాల నుంచి పెన్నానదిలో సరైన ప్రవాహం లేక స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడవలసి వస్తుంది. స్థానిక ప్రజలకు తాగునీరు అవసరమైనప్పుడు మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి దక్షిణ కాలువ ద్వారా పెన్నానదిలోనికి నీటిని విడుదల చేయించుకునే పరిస్థితి. కుందూ నది పరివాహక ప్రాంతంలో మాత్రం ప్రతి ఏడాది కుందూ పరవళ్లుతో కళ కళలాడుతూ వుంటే పెన్నానది మాత్రం వెలవెల బోతుంది.